# కన్నభూమి కనుగొన్న త్రోవ

ఈ తగవుతో బుచ్చమ్మను వేధిస్తున్న ముగ్గురూ పై వూర్ల నించి వచ్చినవాళ్ళే. ఈ భూమియేనాటిదో? ఈ పాక యినాటిదా? పై నించీ వచ్చినవాడు ఫథాలుమని చెంప పెట్టు పెట్టినంత పని చేస్తే బుచ్చెమ్మ సహిస్తుందా?



ప్లీడరు మధుసూదనరావు ఆరు గంటలకే వస్తానని యేడు దగ్గరైనా ఆఫీసుకు రాలేదు. ఇల్లు ఆ మూలకుంది, ఆఫీసుకు యీ మూలకుంది. ప్లీడరు గుమస్తా వస్తాడు వస్తాడనే గంటసేపు కూర్చోబెట్టేసాడు. బుచ్చెమ్మకు విసుగు వచ్చేస్తోంది. తిరిగి బస్సుల్లో ఒక గంట కూర్చుంటే గానీ ఇంటికి చేరలేదు. అసలే ఒక్క క్షణం కాళ్ళో, చేతులో, నోరో యేదో ఒకటి కదప కుండా వూరుకోలేదు కదా!

ప్రక్కనే కూర్చున్న ఒక పంట్లాం బుష్ షర్టు వేసుకున్న బాబు బుచ్చెమ్మను వచ్చిన దగ్గర నించీ దీక్షతో కనిపెట్టూనే వున్నాడు. ఆ యెగిరెగిరిపోతున్న సగం నెరిసిన జుత్తు, పసుపు రాసిన ముఖంలో పొద్దంత కుంకుం బొట్టు, కంటి నిండుగా కాటుక... ఇవన్నీ ఒక యెత్తు. ఆ నోటి నిండుగా పలుకుతున్న మాటలు ఒక యెత్తు - "ఏమిటమ్మా తగువు?" అడిగాడు అతను.

"బాబూ! మాకున్నది ఒక భూమి. ఆ భూమ్మీద ఒక పాక. ఇటు పక్కోడు ప్లీడరు. ఆ ఇంట్లో వున్నది యిద్దరే ఇద్దరు-ఈ పట్నంలో ఆడికి నాలుగు జాగాలు న్నాయి. అటు పక్క మనిషి ఆసుపత్రిలో డాకటేరు. ఆడి వార్డులో రకతాలు. పీల్చినందుకు నల్లులు కూడా లంచం అడుగుతాయి. ఇంటికాడా జనం బారులు తీసుంటారు. అక్కడా యిక్కడా రెండు దిక్కులా మెక్కుతాడు. ఇంతా సేస్తే సంతానం ఒక్కడే బిడ్డ. వెనక మూడోడో కంట్రాక్టరు! ఇసుకతోనే ఇల్లు కట్టించేసి గడించినోడు. ఆ ముగ్గురూ నా భూమ్మీద నిఘా వుంచినారు. ఆల మేడలమద్దిన యీపాక పుండులాగ వుందట!!

"అయితే ఇంతకీ యేం జరిగింది?"

"నా యజమానికి నోరు లేదు. ఉత్తి సత్తికాలం మనిషి. నేను వారం రోజులు వూర్లో లేనప్పుడు మా జాగాలో కంట్రాక్టరు గోడ కట్టించేసి నలభై చదరపు గజాలు కలుపుకున్నాడు"

"నీ మొగుడు వూరుకున్నాడా?"

"వద్దు బాబూ పాపం పని చేయక అంటే, పాపం అంటే యేమిటని అడిగే రోజులు కదా బాబో. వచ్చి లబో దిబో బుర్ర కొట్టుకుని గోడ కొట్టానా లేదా అని అరిస్తే ఆడదాన్నన్న మర్యాదైనా లేకుండా మెడ పట్టుక తోసేసినాడు"

"పోలీసు కేసు పెట్టలేక పోయావా?"

"పెట్టేద్దును. ఆ యెండప్పుడు నా పీక మీద చెయ్యేసి తోసేటప్పుడు సూసింది పొరుగునున్న పీడరు పెళ్ళాం. 'బాబూ, ఆయమ్మ సాక్ష్యం సెప్పితే పోలీసు కేసు పెట్తానంటే,' నా పెళ్ళాం కోర్టు కొస్తే నాకు సిన్నతనం నీళ్లేదనేసాడు. 'తల్లీ నీలాటి ఆడదాన్ని. అబద్దం ఆడను లేదు. చూసిందే సెప్పమన్నాను. 'మాయాయనకిష్టం లేదు, నేను పలకను' అనేసింది. ఇంకేటి గతి? మా యజమాని యెవడి పాపం నోరు అనుభవిస్తాడునే తగునెందుకులే అంటాడు. తగునెట్టకపోతే అన్యాయం బయట పడతాదా?"

"సివిల్ కేసు కదా - చాలా ఆలస్యం అవుతుంది. అప్పుడే వున్న సినరాసిప్పి అమ్మేసినట్లున్నావ్?"

"బాబూ! సెపంచకం మారిపోనాది. ఏం సేస్తే యేం వస్తాదన్న వాళ్ళకే డబ్బు కనిపిస్తున్నాది. ఆనాడు యైదు రూపాయిలు లంచం తిన్నోడు యిప్పుడు యేభయికి తక్కువిస్తే విసరికొట్టేస్తున్నాడు. అయి దొందలు సరిపోతాయని సెప్పిన యీ పీడరు యీ యేడాదికే మూడు యేలుదాకాడేకుర్తాదని సెప తన్నాడు"

"ఎందరు పిల్లలు నీకు?"

"ఇద్దరు బొట్టెల్ని ఇంత పసుపు పోసి అత్తారిల్లకి పంపేసాను. ఒక్కడే బొట్టెడు. ఆడికి రైల్వేలో పని కుదిరింది. కర్గపూరు వర్కుషాపులో పని"

"ధర వచ్చిందెప్పుడో - అమ్మేకూడదా? కొడుకు అడ్డు పడుతున్నాడా?" "ఆడూ అమ్మే మంటున్నాడు. ఆడికి భూమి మీద మమకారాలేటి తెలుసు?"

"ఏమిటా మమకారం?"

"మా యజమానీ ఆ పాకలోనే పుట్టినాడట. నాను కాపరానికొచ్చి ఆ పాకలో ముగ్గురి పిల్లల్ని కన్నానా? ఆ మట్టిసారం మాకు అంతా మంచే జరిగింది బాబూ! ఈ భూమీ దాని మీద యీ పాక నాకు మా త్త అప్ప జెప్పింది. మా అత్తకి దాని అత్త అప్ప జెప్పిందట. ఆ నాటికి అది పల్లెటూరు. ఇప్పుడు పట్నంలో కలి సేసుకోవటం వల్ల దీని మీద ఇందరి కళ్ళు పడ్డాయి. నాకు అప్పజెప్పిన జాగా అప్ప చెప్పినట్లు నా కోడలికి అందివ్వనద్దా?"

"నీ కోడలు దూరంగా వెళ్ళి పోయింది కదా నీకున్న మమకారం ఆమె కుంటుందా?"

బుచ్చెమ్మ అంత వరకూ వాగుతూనే వున్నది. ఒక్క నిట్టూర్పుతో ఆగిపోయింది.

"ఏమిటి ఆలోచిస్తున్నావ్?"

"ఇరుగు, పొరుగు, వెనకా పాకలు అమ్మినోళ్ళంతా మా బంధువులే బాబూ... వాళ్ళు మతిలోనికి వచ్చి నారు"

"వాళ్ళకేమైంది?"

"ఇప్పుడు డాకటేరు కట్టిన మేడ వుంది కదా! మా చుట్టమే ధరొచ్చిందని పదిసేను వేలకమ్మేసినాడు. ఇప్పుడు ఆ పక్క వీథిలోనే అద్దె కొంపలో వున్నాడు. ఈ డాకటేరు కొన్న ఆ జాగా యీనాడు రెండు లచ్చలు చేస్తాది. మా చుట్టం ఒంట్లో నిమ్మళం లేక వస్తే యైదురూపాయిలు యిస్తేనే యింజీషను పొడుస్తాడు. తలదాచుకోడానికి సొంత ఇల్లుంటే యెంత గదుసుగా మాటాడినా సెల్లుతుంది బాబూ!"

"ఈ కోర్టుకు యీ డబ్బు పోసే బదులు ధర వస్తే అమ్మా కూడదా? "నివ్వు ఆ జాగాలో మెసిలితే నివ్వు అలాగా అమ్మే మనకపోదువు"

"ఒకటి కాదు - మూడు పెద్దనక్కల మధ్య చిక్కుకున్నాను. ముగ్గురూ మృగాల రూపంలో మున్న మనుషులు. వాళ్ళ నించి తప్పించుకోడానికి నీ దగ్గర మిగిలింది ఒక్కటే"

"లోకం పాడై పోనాది. నీతిపరులు మిగల్లేదను కున్నాను. నీలాటి నోళ్ళుండ బట్టే కదా నా బాధ తెలుసుకున్నావు. నీవెవరోగాని బాబూ, నా దగ్గర మిగిలిందేదో వుందంటున్నావు - సదువుకున్నదాన్నా, డబ్బున్నదాన్నా, నా దగ్గర మిగిలిందేటి బాబూ?"

"నువ్వు తెలివైన దానివి. ఆ తెలివిని వాడుకో" అంటూ అతగాడు యెనిమిద దాటినా ప్లీడరు రాలేదని వెళ్ళిపోయాడు.

అతను యెవడో, అతను ప్లీడరు దగ్గరకు యెందు కొచ్చాడో యేదీ అడగలేదని కాస్సేపు గింజుకుని, ఆ వేళకి ప్లీడరు రాడని తెలియగానే మొగుడితో యింటికెళ్ళి పోయింది.

ఇంటికి వెళ్ళాక రెండు రోజుల వరకూ అతగాడు




కళ్ళకు కట్టుండం వలన "పంతానికి పోయి కోర్టులో కయ్యానికి దిగితే - ఆ కేసు యిప్పుడు దయ్యంలా పట్టుకుంది. ఈ దెయ్యం వదిలించుకోడానికీ ఖర్చే" అసలు దెయ్యాలు ఆమె పాకకి మూడు పక్కలా వున్నాయి. ఈ వదలని దెయ్యాలతో యేం చెయ్యడం?" ఆ సదువుకున్న బాబూ నన్ను తెలివైన దాన్నన్నాడు కదా నాలో యేం సూసి అలా అన్నాడో?" ఆలోచించి ముందు డాక్టరు దగ్గిరికి వెళ్ళింది.

"జాగా అమ్మేస్తాను. నీకేయిస్తాను. ఎవరికీ చెప్పకు. ఎంతిస్తావ్?" ఆ మాటలే యిటు ప్లీడరుకీ పెరట కంట్రాక్టరుకీ చెప్పింది. ముగ్గురూ బేరగాళ్ళే. ఇంట్లో బోల్డు డబ్బున్నా చెయ్యి వదలని వాళ్ళే. నాలుగు రోజులయ్యాక ఇంకో షరతు పెట్టింది. "ఎవరు కొన్నా కంట్రాక్టరు బాబు కాజేసిన నలభై చదరపు గజాలు జాగాకి డబ్బు ఇవ్వాలి"

ఈ కొత్త షరతుకి కోపాలొచ్చాయి. "అంత కోపంతో కొనకండి. ఎందరో ఎక్కి తొక్కుతున్నారు. మీరిస్తారన్న దానికన్నా నాకు హెచ్చే వస్తాది"

ముగ్గురూ యీభూమి కోసం ప్రాకులాడుతున్నారని తేలిపోయింది. వేలం పాటలా ధర పెరిగి పోయింది. వారం రోజులు టైమిచ్చింది."చివరి పలుకు పలకండి. ఎవరికివ్వాలో తేలుస్తాను!! ఆనాటికి చివరి క్షణంలో వేర్వేరుగా ముగ్గురూ వచ్చి బుచ్చెమ్మకు మొత్తం యిచ్చే ధర చెప్పారు. విన్నది-ముసి ముసి నవ్వుకుంది. ముగ్గురూ పురోణీ రాయించేసుకున్నారు. "నాకు నెల రోజులు టైమివ్వండి. మా బాబుతో చెప్పొద్దూ? ఆడు రావాల, సంతకం పెట్టాల కదా" అంది.

ఆ రాత్రి బుచ్చెమ్మకు నిద్దర పట్టలేదు. రాత్రంతా జాగరణ చెయ్యడం, ఆ మట్టిలో కోడలిగా కాలు పెట్టిన దగ్గర నించీ ఇదే మొదటిసారి!" అదెవరో? ఆ బాబుది తన కొడుకు వయసు. ఊరేంటో - పేరేంటో...? ఎంత చక్కగా మాటాడేడు. ఇన్నాళ్ళా సదువులేని దానివి. తలలో పేలు తీసుకుంటూ, ఇంట్లో పేడ అలుకుతూ బతికిన దాన్ని. నాను తెలివైనదాన్నన్నాడు. నా తెలివేంటో తెలుసుకోవద్దా - తెలుసుకున్న తెలివిని వాడుకోవద్దా?"

నెల రోజుల తరువాత ఒక మంచి రోజు ఉదయం ఈ పాక పెరట బుచ్చెమ్మ మొగుడు గునపంతో మట్టిని పెకలిస్తుంటే, పెరట కాంట్రాక్టరు మేడ మీదనించి చూసి మొగుడు పక్కన నిల్చున్న బుచ్చెమ్మతో

"అలా గోతులు తవ్వించేస్తున్నవేంటి?"

"ఇది మా జాగా - నీ జాగా కాదు"

"నేను కొంటే నా జాగా అవ్వదా... అప్పుడు ఇల్లు 'కట్టడానికి పని కొస్తుందా" జవాబు చెప్ప కుండా ఆ తవ్విన మన్ను ఒక గోనెలో వేసింది. అలాగే తూరుపుకు, పడమరకు తవ్వుతుంటే అటు వేపు నించి చూస్తున్న ప్లీడరూ డాక్టరూ... హా! హా అదేం చేస్తున్నావని కేకలేసారు. వాళ్ళకి జవాబు చెప్పకుండా ఆ మన్ను ఒక బాల్టీలో నింపింది. ఇంట్లో వండి, తిన్న చోట యింత మన్ను తవ్వించి బిందెలో పోసింది. రిక్షా తెచ్చి యీ మన్నుతో యేం చేస్తుందని వెనకనే ముగ్గురు తోడేళ్ళు పరుగెత్తారు.

బుచ్చెమ్మ కొత్తగా కొనుక్కున్న చిన్న జాగాలో పునాదులు తవ్విన చోటు యెదురుగా రిక్షా ఆపించింది. అంత దూరం నించే యీముగ్గురూ యేం చేస్తుందోనని చూస్తున్నారు. పునాదుల ముందు తూర్పు వేపు తిరిగి బుచ్చెమ్మా, మొగుడూ నిల్చున్నారు. ఇద్దరూ బస్తానించి దోసిళ్ళతో మన్ను తీశారు. "మూడుసార్లు ముద్దెట్టు" అంది బుచ్చెమ్మ, మొగుడితో! దోసిళ్ళో వున్న మట్టిని ముద్దెట్టుకున్నాక ఆ ముగ్గురికీ వినిపించేటంత గట్టిగా బుచ్చెమ్మ.

"కన్న భూమీ, మముకన్న తల్లీ - నీ ఒడిలోనే బతకాలన్న మమకారంతో యీ తోవ కనుకున్నాను." అంటూ ఆ తెచ్చిన మన్ను దోసిళ్ళతో తీసి ఇద్దరూ యీ కొత్త జాగాలో పరుస్తున్నారు. అలా వచ్చిన ముగ్గురి వేపు చూసి బుచ్చెమ్మ "మా తరతరాల మట్టి యిప్పుడు ఇదే ఇక్కడే హాయిగా బతుకుతాం" అంది.

"ఆ పాక సంగతి?" అడిగాడు డాక్టరు.

"గ్రెలమని మా మీద పడ్డారు: ఈ మూడు పెద్ద నక్కలనీ మింగేసే పెద్ద పులి అక్కడ కొస్తున్నదిలే"

"అమ్మేసావా?"

"ఆ మార్వాడీ వోడికి అప్పుడే పురోణీ రాసేసినాను. అయిదంతస్థుల వోటేలు కట్టిస్తాడట. తోకలు ముడుసుకుని యిక మీ ఇల్లల్లో బబ్బోండి"

అంటూ తన పనిలో బుచ్చెమ్మ నిమగ్నమైంది. ◆

## మహారాజ్యమా? మహాభాష్యమా?

ధన కనక వస్తు వాహనాలకీ గౌరవ సత్కారా లకీ ప్రలోభ పడకుండా, ఎవరి దగ్గరా దేహీ అని చెయ్యి చాపకుండా హుందాగా రాజగా దర్జాగా బ్రతికిన మహా విద్వాంసుల్లో భాగవతి హరిశాస్త్రి గారు ఒకరు. వ్యాకరణంలో కాశీ పండితుల్ని ఓడించి వచ్చి తూర్పు గోదావరి జిల్లా కోటిపల్లిలో స్థిర నివాసం ఏర్పాటు చేసుకుని పఠన పాఠశాలలో కాలం గడిపేవారు. నిలువెత్తు ధనం ఇస్తానన్నా ఆయన కోటిపల్లి దాటి అడుగు బయట పెట్టేవారు కాదు. చీకటి ఉండగా గోదావరికి వెళ్ళి స్నానం చేసి రావడం - శిష్యులకి పాఠం చెప్పుకోవడం - అంతే. మళ్ళీ పాలక్షుడు వచ్చినా గడప దాటి బయటికి వెళ్లడం లేదు. తిరిగి మర్నాడు గోదావరి స్నానానికే బయటికి రావడం. ఆ మహానుభావుడి దర్శనం చేసుకోవాలనుకున్నారు పిఠాపురం రాజా శ్రీ రావు గంగాధర రామారావుగారు. కానీ ఎలా? శాస్త్రిగారు కోటిపల్లి విడిచి రారే? సరే - రాజావారే కోటిపల్లి వెళ్లారు. కానీ శాస్త్రిగారి ఇంటికి వెళ్లడానికి రాజసం అడ్డువ




చ్చింది. వేరే ఓ చోట మకాం చేసి, చీకటి వుండగా, గోదావరి స్నానం చేసి వస్తున్న శాస్త్రిగారికి ఎదురు వెళ్లి నమస్కారం చేసి తనని పరిచయం చేసుకుని 'మీ దర్శనం చేద్దాం అని వచ్చాను' అన్నారు పిఠాపురం రాజా. శాస్త్రిగారు గంభీరంగా 'చేశారుగా?' అన్నారు. 'మరి సత్కారం...' అంటూ నీళ్లు నమిలారు గంగాధర రామారావుగారు. శాస్త్రిగారు సత్కారానికి తిరస్కారంగా తల త్రిప్పి చిరునవ్వు నవ్వి 'మహారాజ్యం నా పాలయే న్మహాభాష్యం పాఠయేత్' అంటూ వెళ్లిపోయారు. మహారాజ్యం పాలించేవాడికి ఎంత ఆనందం కలుగుతుందో, పతంజలి మహాభాష్యం పాఠం చెప్పుకునే వాడికి కూడా అంతే - అంతకంటే ఎక్కువ కూడా అని దాని అర్థం. - విద్యాధనం ముందు భౌతిక సంపద ఒక లెక్కా? గడ్డి పరకతో సమానం. అనే దృష్టితో వెళ్లిపోయిన హరిశాస్త్రి గారిని చూస్తూ అవాక్కయి నిలబడిపోయారు పిఠాపురం రాజా.

—పోలాప్రగడ